నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జాతీయ సైక్లింగ్ పోటీల్లో వర్షిత్ ప్రతిభ

బహుమతులు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 : ఇటీవల జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 సైక్లింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి వర్షిత్ ప్రతిభ చూపాడు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన జాతీయ స్థాయి సైక్లింగ్ టీమీ స్ప్రింట్ విభాగంలో వర్షిత్, సింహాచలం, అభిషేక్‌రెడ్డిలతో కూడిన తెలంగాణ బృందం కాంస్య పతకం కైవసం చేసుకుంది. ప్రథమ స్థానంలో రాజస్థాన్, ద్వితీయ స్థానంలో మహారాష్ట్ర, తృతీయ స్థానాన్ని తెలంగాణ దక్కించుకున్నాయి. వర్షిత్‌ను డీఐఈవో శైలజ, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, పీడీ బొంకూరి బాబురావు, లెక్చరర్లు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలి

- అదనపు కలెక్టర్ ఎస్ మోతీలాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎస్ మోతీలాల్

దండేపల్లి, (లక్షెట్టిపేట), ఫిబ్రవరి 10 : మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతీలాల్ అన్నారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో చందారం గ్రామంలో కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించిన మహిళలకు శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుట్టు శిక్షణలో నైపుణ్యం కనబర్చినవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా వయోజన విద్యాశాఖ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం నాయక్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, డీఆర్పీలు కొండు జనార్దన్, వెంకటేశ్వర్లు, అశోక్‌రావు, హెచ్ఎం హరినాథ్, శిక్షకురాలు మంజుల పాల్గొన్నారు.

దళారుల వలలో సబ్సిడీ చేపలు

- నేరుగా జలాశయాల వద్దే కొనుగోళ్లు చేపడుతున్న వ్యాపారులు
- కిలోకు రూ. 160 చొప్పున కొని.. ఆపై రూ. 300లకు విక్రయం
- పట్టించుకోని అధికారులు.. నష్టపోతున్న మత్స్యకారులు

నీరుగారుతున్న 'నీలి విప్లవం' లక్ష్యం

కుమ్రం భీం ప్రాజెక్టు వద్ద చేపలు తరలించేందుకు బొలెరోతో వచ్చిన దళారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ సర్కారు నీలి విప్లవానికి శ్రీకారం చుట్టగా, అధికారుల నిర్లక్ష్యంతో.. ఆ లక్ష్యం నీరుగారిపోతున్నది. వ్యాపారుల ప్రమేయాన్ని నియంత్రించాల్సిన మత్స్యశాఖ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండగా, సొసైటీ సభ్యులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నది. మత్స్యకారుల ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా కేసీఆర్ సర్కారు నీలి విప్లవానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాలోని నాలుగు ప్రధాన జలాశయాలు పీపీరావ్ ప్రాజెక్టు, ఎన్టీఆర్‌సాగర్, వట్టివాగు, కుమ్రం భీం ప్రాజెక్టుతో పాటు దాదాపు 250 నీటి వనరుల్లో కోటీ 38 లక్షల చేప పిల్లలను విడుదల చేసింది. 5 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 60 మత్స్య సహకార సంఘాలుండగా, వీటిలో 5 వేల మంది సభ్యులున్నారు. అలాగే అనేక గిరిజన కుటుంబాలు కూడా చేపల వేటపై ఆధారపడి ఉన్నాయి. ఆయా సంఘాలు స్వయం ఉపాధి పొందేలా చేపల పంపకాన్ని వాటికే అప్పగించింది. చేపల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యంతో పాటు మత్స్యకారులకు వాహనాలను కూడా సమకూర్చింది.

మత్స్య సంపదపై దళారుల కన్ను

ప్రస్తుతం జలాశయాల్లో చేపల వేట కొనసాగుతుండగా, దళారులు కన్నేశారు. గ్రామీణ ప్రాంతాల మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు సొమ్ముచేసుకుంటున్నారు. మహారాష్ట్ర, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వస్తున్న దళారులు నేరుగా ఇక్కడి మత్స్య సంఘాలతో ఒప్పందాలు చేసుకొంటున్నారు. చెరువులను స్వాధీనం చేసుకొని కాపలాదారులను పెట్టుకుంటున్నారు. చేపల రకాన్ని బట్టి కిలోకు రూ. 100 నుంచి రూ. 160 దాకా పెట్టి చెరువుల వద్దే కొనుగోలు చేస్తున్నారు. ఆపై పట్టణ ప్రాంతాలకు తరలించి కిలోకు రూ. 300 చొప్పున విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. మత్స్యకారులు నేరుగా చేపలు పట్టుకొని అమ్ముకునేలా గత సర్కారు అన్ని సౌకర్యాలు కల్పించింది. దళారుల ప్రమేయాన్ని నియంత్రించాల్సిన మత్స్యశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో మత్స్యకారులు అన్ని విధాలా నష్టపోవాల్సి వస్తున్నది.

మంచిర్యాల టూ మేడారం

మహా జాతర కోసం ఆర్టీసీ సన్నద్ధం

- జిల్లాలోని ఐదు ప్రాంతాల నుంచి బస్సులు
- మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో పెరుగనున్న సర్వీసుల సంఖ్య

మంచిర్యాల బస్టాండులో నిలిచిఉన్న ఆర్టీసీ బస్సులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 10 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర కోసం ఆర్టీసీ సన్నద్ధమైంది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. మంచిర్యాల జిల్లాలోని ఐదు ప్రాంతాల నుంచి మేడారం జాతరకు బస్సులను నడిపించనున్నది. మహాలక్ష్మీ పథకం నేపథ్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివెళ్లనుండగా, అందుకనుగుణంగా బస్సుల సంఖ్యను కూడా పెంచాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు కూడా మంచిర్యాల జిల్లా మీదుగా మేడారానికి తరలి వెళ్లనున్నారు. ఇక్కడ సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతాలు విస్తరించి ఉండడం, సమ్మక్క-సారలమ్మలను తమ ఇష్టదైవాలుగా కొలిచే భక్తులు అధికంగా ఉన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఇతర డిపోల నుంచి కూడా బస్సులను ఇక్కడికి తీసుకురానున్నారు. జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, చెన్నూరు బస్టాండుల నుంచి మేడారానికి బస్సులు నడపనున్నారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జాతరకు బస్సులు నడిపించనున్నారు. బస్టాండుకు పక్కనే ఉన్న జడ్పీ బాలుర పాఠశాల మైదానం నుంచి బస్సులను పంపించనున్నారు. టికెట్ల కౌంటర్లు అక్కడే ఏర్పాటు చేయనున్నారు. నిత్యం బస్టాండ్ నుంచి వెళ్లే సాధారణ ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. మిగిలిన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, చెన్నూరులలో ఆర్టీసీ బస్టాండుల నుంచే బస్సులను నడుపనున్నారు. మంచిర్యాల డిపో నుంచి 110 ఆర్టీసీ బస్సులతో పాటు 30 హైర్ బస్సులను మేడారానికి నడిపించనున్నారు. చెన్నూరు బస్టాండు నుంచి ఆదిలాబాద్ డిపోకు చెందిన 65 బస్సులు, శ్రీరాంపూర్ బస్టాండు నుంచి ఉట్నూర్, ఖైరీ డిపోలకు చెందిన 45 బస్సులు, మందమర్రి బస్టాండునుంచి నిర్మల్ డిపోకు చెందిన 65 బస్సులు, బెల్లంపల్లి బస్టాండు నుంచి ఆసిఫాబాద్‌డిపోకు చెందిన 50 బస్సులను మేడారం వెళ్లే భక్తుల కోసం నడిపిస్తారు. మంచిర్యాల నుంచి మేడారానికి పెద్దలకు రూ.410, పిల్లలకు రూ. 220 చార్జీలు వసూలు చేస్తారు. శ్రీరాంపూర్ నుంచి పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ. 210, మందమర్రి నుంచి పెద్దలకు రూ.450, పిల్లలకు రూ. 250, బెల్లంపల్లి నుంచి పెద్దలకు రూ. 460, పిల్లలకు రూ. 250, చెన్నూరు నుంచి పెద్దలకు రూ. 420, పిల్లలకు రూ. 230 వసూలు చేస్తారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం

మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 18వ తేదీ నుంచే మేడారానికి బస్సులు నడుపుతాం. 20వ తేదీనుంచి రద్దీ పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా బస్సులను నడిపిస్తాం. గతేడాది కంటే ఈసారి 50 వరకు బస్సులను ఎక్కువగా నడిపించాల్సి వస్తుందని అనుకుంటున్నాం. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని భక్తులను కోరుతున్నాం.

- రవీంద్రకుమార్, మంచిర్యాల డిపో మేనేజర్

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

సమావేశంలో బోర్కడే హేమంత్ సహదేవరావు, అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 10 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సెక్టోరియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అధికారులకు కేటాయించిన రూట్ మ్యాప్‌లను పాటించాలని, ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ రోజున ఈవీఎంలలో సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున ముందస్తుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని, అధికారులు తమకు కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని పేర్కొన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి పాల్గొన్నారు.

పీవీటీజీలకు మెరుగైన వైద్యమందించాలి

పీవీటీజీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద పీవీటీజీలకు వైద్య సేవలు అందించేందుకు ఒప్పంద పద్ధతిన వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లను నియమించామన్నారు. మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పీవీటీజీ కుటుంబాన్ని సందర్శించి ఆరోగ్య వివరాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి తుకారాం, సిబ్బంది తపాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- క్రీడా డైరెక్టర్ వీకే సింగ్
- ఆలుగామలో కిసాన్ మేళా

రైతులకు విత్తనాలు అందజేస్తున్న క్రీడా డైరెక్టర్ వీకే సింగ్, సైంటిస్టులు

కోటపల్లి, ఫిబ్రవరి 10 : సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని భారతీయ మెట్ట పరిశోధనా సంస్థ (క్రీడా) డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. శనివారం కోటపల్లి మండలం ఆలుగామ గ్రామంలో భారతీయ మెట్ట పరిశోధనా సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్, భారత ప్రభుత్వం వారిచే కిసాన్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రైతుల అభివృద్ధికి భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని, అందులో భాగంగానే రైతులకు విత్తనాలు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు, మెషినరీలు అందజేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యవంతులను చేస్తున్నామని చెప్పారు. క్రీడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఎస్సీ రైతుల అభివృద్ధికి తమ సంస్థ ఎప్పుడూ కృషి చేస్తుందన్నారు. వ్యవసాయంలో శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించటలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ ద్వారా రసాయనాలు, కలుపు మందులు, పురుగు మందులు, తెగులు నివారణకు మందులు ఎలా పిచికారి చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ విధానం వల్ల రైతులకు సమయం, నీరు, రసాయన మందులు ఆదా అవుతాయని, డ్రోన్‌ల ద్వారా ఐదు నిమిషాల్లో ఎకరం స్ప్రే చేసుకోవచ్చని వివరించారు. రైతు గ్రూపులకు సబ్సిడీపైన డ్రోన్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. సాయిల్ సైన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎస్ఎస్ బల్లోలి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్‌లు కేఎస్ రెడ్డి, శ్రీదేవి శంకర్, టీవీ ప్రసాద్, జీ. వెంకటేశ్, విశాకుమారి, అన్విద, ఆశిష్, నూరు మూర్తి, కోటపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, ఎస్సీ రైతులు పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్లకు బీమా బాండ్ల అందజేత

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా మంచిర్యాల నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దక్షిత ఫౌండేషన్ సహకారంతో ఈ నెల 11న సాయంత్రం స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) 3 వేల మందికి ఇన్సూరెన్స్ బాండ్‌లను అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ బదావత్ సంతోష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ ఆర్‌వో కొప్పుల స్వరూపారాణి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,727 మంది, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2,782 మంది, మంచిర్యాల జిల్లాలో 3,335 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు. రూట్ ఆఫీసర్‌లుగా వై ఆనంద్ రెడ్డి (ఆదిలాబాద్), జీ రాజ్ కుమార్ (ఆసిఫాబాద్), కే మహేశ్వర్ రావు (మంచిర్యాల) ఉన్నట్లు పేర్కొన్నారు.

గ్రూప్-4లో సత్తాచాటిన శ్రీరామ్ శివకృష్ణ

- రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన జిల్లావాసి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 10 : శుక్రవారం విడుదలైన గ్రూప్-4 పరీక్షా ఫలితాల్లో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శ్రీరామ్ శివకృష్ణ సత్తాచాటాడు. 220.458 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 2013-14లో పదో తరగతి పూర్తి చేసిన శ్రీరామ్ శివకృష్ణ, బాసరలో ఐఐటీ పూర్తి చేశారు. ప్రస్తుతం కాసిపేట సింగరేణి రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీరామ్ శివకృష్ణకు రాష్ట్రస్థాయి ర్యాంక్ రావడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

- ప్రతి ఒక్కరూ పాస్ అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలి
- మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలి
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 10 : పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపేలా కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఈవో యాదయ్యతో కలిసి విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు -సన్నద్ధత కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌పై ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తయ్యిందని, రివిజన్‌పై దృష్టి పెట్టాలన్నారు. గత పరీక్షల ప్రశ్నా పత్రాల ద్వారా విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెంచాలని, ఎలాంటి అపోహలు, భయం లేకుండా పరీక్షలు రాసే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ కచ్చితంగా పాటించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బియ్యం నిల్వలు ప్రతి రోజూ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, పురుగులు పట్టిన బియ్యం వస్తే వెంటనే సంబంధిత తహసీల్దార్, డీఈవోకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ వారంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు పాఠశాలలను సందర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ దామోదర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి భీంరావు, సహాయ కార్యదర్శి కుమార స్వామి, విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

నస్పూర్, ఫిబ్రవరి 10 : ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పాటు పని కల్పించాలని కలెక్టర్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రితో కలిసి ఏపీవోలు,ఏపీఎంలు, ఈసీలు, సెర్ప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీపథకంలో భాగంగా చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని,కూలీ ధరలు, పని దినాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ కుటుంబాలకు వంద రోజుల పాటు పని కల్పించే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సహాయం, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

హాజీపూర్, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయాల అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తమ దృష్టికి వచ్చిందని, సమయపాలన పాటిస్తూ అందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాలు జారీచేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు తహశీల్దార్‌తో పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని, కొందరు జిల్లా హెడ్ క్వార్టర్ దాటిపోయినా సమాచారమివ్వడం లేదని, ఇకపై నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బిందెలతో కోనేరుకు వస్తున్న కొత్త కోడళ్లు

నాగోబా ఆలయంలో భక్తులకు హరిత ఇస్తున్న మెస్రం వంశీయులు

కొత్త కోడళ్లకు బేటింగ్

సంస్కృతీ సంప్రదాయాల మధ్య సతీక్ దేవతలకు పూజలు

- 202 మంది కొత్త కోడళ్లకు నాగోబా దర్శనం
- 22 కితలకు చెందిన కొత్తకోడళ్లకు గోవాడ్ ప్రవేశం
- అవ్వాల్ దేవతకు మొక్కులు.. సహపంక్తి భోజనాలు..

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10 : కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు మహాపూజ నిర్వహించిన అనంతరం సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం 202 మంది కొత్త కోడళ్లకు పరిచయ కార్యక్రమం(బేటింగ్) నిర్వహించారు. అనంతరం పెద్దల సమక్షంలో సతీక్ దేవతను పూజించారు. నాగోబాను దర్శించుకున్న తర్వాత మెస్రం వంశీయుల కోడళ్లుగా స్వీకరించారు. అనంతరం వారికి సంప్రదాయబద్ధంగా గోవాడ్‌లో ప్రవేశం కల్పించారు.

గోవాడ్‌లో శుద్ధి కార్యక్రమం

మెస్రం వంశీయుల మహిళలతో కొత్తకోడళ్లు గోవాడ్‌లో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 కితలకు చెందిన కొత్తకోడళ్లు ఉదయం గోవాడ్ నుంచి మర్రిచెట్ల ప్రాంతంలోని కోనేరుకు వెళ్లారు. అక్కడి నుంచి బిందెలతో నీటిని తీసుకొచ్చి గోవాడ్‌లో ఆ జలాన్ని చల్లుతూ శుద్ధి చేశారు. అనంతరం గోవాడ్‌లో వారి దేవతలకు పూజలు నిర్వహించారు. 22 కితల నుంచి సేకరించిన నవ ధాన్యాలతో నైవేద్యాన్ని వండారు. అందరూ కలిసి వంటలు చేసి కితలవారీగా పంచుకున్నారు.

అవ్వాల్ దేవతకు పూజలు

మెస్రం వంశీయుల మహిళలతోపాటు కొత్తకోడళ్ల ఆధ్వర్యంలో 22 కితలవారీగా అవ్వాల్ దేవతకు దీపాలు వెలిగించి సంప్రదాయ పూజలు నిర్వహించారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉపవాస దీక్షలు విరమించి సామూహిక భోజనం చేశారు. కాగా.. నాగోబా ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న గోవాడ్‌లో మెస్రం వంశీయుల మహిళలు సంప్రదాయ పూజలు నిర్వహించారు. గోవాడ్‌లో బస చేసిన మహిళలు కితలవారీగా 22 పొయిలపై సామూహికంగా వంటలు చేస్తున్నారు. నైవేద్యాలు ఉంచిన వెదురు బుట్టల వద్ద దీపాలు వెలిగించి సంప్రదాయ పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. గోవాడ్‌లో మహిళలు కుర్చొని నాగోబా చరిత్రతోపాటు మెస్రం వంశీయుల సంప్రదాయాలపై చర్చిస్తున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.